


ముసుగులు తొలగేదెప్పుడో?
సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసినా రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను ఇంకా తొలగించకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. 8లో ▸



బాల్యానికి ఏదీ భరోసా?
బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 8లో ▸

జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు


ఎస్సీ, ఎస్టీ, బీసీలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడులకు పాల్పడటంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ ఫిర్యాదు చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్ జగన్ అడుగుజాడలోనే..



వైఎస్ జగన్‌ను కలిసిన పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసేవే లక్ష్యమని, ఆయన బాటలోనే తానూ నడుస్తానని జగన్‌కు వివరించినట్లు ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను వీరన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓటమి, పెత్తందారుల పోకడలతో నష్టపోయే బలహీనులకు అండగా ఉండి పార్టీ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపాలని జగన్ సూచించారన్నారు. తెలుగుదేశం పార్టీ కూటమి మేనిఫెస్టో అమలు కోసం వైఎస్సార్ సీపీ తరపున ప్రజల గొంతుకై ముందుకు సాగుతామని వీరన్న తెలిపారు.

ఇసుక ర్యాంపులపై ప్రత్యేక నిఘా



సిద్ధాంతంలో ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జయప్రసాద్ తదితరులు

పెనుగొండ: సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా గనుల శాఖాధికారి జి.జయప్రసాద్ చెప్పారు. మంగళవారం పెనుగొండ మండలంలోని సిద్ధాంతం, నడిపూడి ఇసుక ర్యాంపులను ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జయప్రసాద్ మాట్లాడుతూ సహజ పర్యావరణకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో జలవనరుల శాఖ గనులు, కాలుష్య నివారణ మండలి, ఎస్ఈబీ పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోడె నాగుల పట్టివేత



కోడె నాగులను పట్టుకున్న స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షులు చదలవాడ క్రాంతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మారుతీ నగర్‌లో నివాసాల మధ్య సంచరిస్తున్న కోడె నాగులను స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షులు చదలవాడ క్రాంతి మంగళవారం పట్టుకున్నారు. మారుతీనగర్‌లోని కోటేశ్వరరావు ఇంట్లో రెండు కోడె నాగులు ప్రవేశించాయి. కుటుంబ సభ్యులు భయాందోళనకు గురికాగా, కోటేశ్వరరావు సమీపంలో ఉన్న స్నేక్ సేవియర్ సొసైటీ సంస్థకు సమాచారం అందించారు. సంస్థ అధ్యక్షులు చదలవాడ క్రాంతి.. కోటేశ్వరరావు ఇంటికి చేరుకుని కోడె నాగులను చాకచక్యంగా పట్టివేశారు. దీంతో ఆ ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న కోడెనాగులను క్రాంతి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

జూలై 1లోగా టీటీసీ పరీక్ష ఫీజు చెల్లించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూమ్, వీవింగ్ (లోయర్‌గ్రేడ్) పరీక్షలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పరీక్షలు వచ్చే ఆగస్టులో విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఆయా జిల్లాల్లో టీటీసీ 42 రోజుల ట్రైనింగ్ కోర్సుల్లో పాల్గొంటున్న వారు, గతంలో ఉత్తీర్ణులు కానివారు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అభ్యర్థులు బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ ద్వారా ఆయా కోర్సుల ఇన్‌చార్జులకు దరఖాస్తు చేసి, పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష ఫీజును జూలై 1వ తేదీ లోపు చెల్లించాలని, రూ.50 అపరాధ రుసుముతో జూలై 6 లోపు చెల్లించవచ్చన్నారు. పరీక్ష ఫీజు రూ.150 రుసుమును పైన తెలిపిన వెబ్‌సైట్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని డీఈఓ సూచించారు.

ఫీజుల మోత

విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఏటా స్కూళ్ల ఫీజులను యాజమాన్యాలు భారీగా పెంచేస్తుండటంతో గగ్గోలు పెడుతున్నారు. ఇక పేరొందిన కార్పొరేట్ స్కూళ్లలో దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. నిబంధనలకు విరుద్ధంగా విద్యాసామగ్రి, యూనిఫామ్ విక్రయాలు చేస్తుండటమే కాక ఐఐటీ, జేఈఈ శిక్షణ పేరుతో అదనంగా ఫీజులు వసూలు చేస్తుండటం గమనార్హం.



భీమవరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నోట్ పుస్తకాల విక్రయాన్ని అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

- తల్లిదండ్రులకు భారంగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువులు
- ప్రతి ఏటా ఫీజులు భారీగా పెంచేస్తున్న యాజమాన్యాలు
- ప్రాథమిక స్థాయి నుంచే ఐఐటీ, జేఈఈ అంటూ అదనంగా వసూళ్లు
- నిబంధనలకు విరుద్ధంగా విద్యా సామగ్రి, యూనిఫామ్ విక్రయాలు
- జిల్లాలో 563 ప్రైవేట్ స్కూళ్లలో 1.43 లక్షల మంది విద్యార్థులు
- వేసవి సెలవుల అనంతరం రేపటి నుంచి స్కూల్స్ పునఃప్రారంభం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో గణపవరం మండలం మినహా మిగిలిన 19 మండలాల్లో సుమారు 563 ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలోని చాలా స్కూళ్లలో నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని స్కూళ్లలో ఫస్ట్ టర్మ్ ఫీజులు వసూలుతోపాటు ఎంటెక్, ఐఐటీ, ఒలింపియాడ్, జేఈఈ శిక్షణకంటూ అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్, బ్యాగ్స్, బూట్లు, బస్సు రవాణాకు చెల్లించాల్సిన సొమ్ముతో తడిసిమోపెడవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా విద్యా ఖర్చు మోతెక్కి మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది కార్పోరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు 10 నుంచి 20 శాతం వరకు పెంచినట్లు చెబుతుండగా పాఠ్యపుస్తకాల ధరలు సైతం 25 శాతం వరకు పెరిగినట్లు అంచనా. విద్యా సంస్థల బస్సుల ఫీజులు సైతం గతేడాది కంటే దూరాన్ని బట్టి రూ.1,000 నుంచి రూ. 2 వేలు వరకు పెంచినట్లు తెలుస్తోంది.

పుస్తకాల ధరల పెరుగుదలతో మరింత భారం

ఈ ఏడాది పాఠ్య, నోట్ పుస్తకాలు ధరలు పెరగడంతో తల్లిదండ్రులకు మరింత భారంగా మారింది. గత ఏడాది రూ.70 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.85కు చేరింది. పాఠ్య, నోట్ పుస్తకాల ఖర్చు గత ఏడాది ఆరో తరగతి విద్యార్థికి రూ.7,500 అయితే పెరిగిన ధరతో ఈ ఏడాది రూ.9 వేలు పైమాటేనంటున్నారు. పుస్తకాలకే గాకుండా ఇంకా పెన్నులు, పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువుల కొనుగోలు ఆదనం.

జిల్లాలో 563 ప్రైవేట్ విద్యా సంస్థలు

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు 563 ఉన్నాయి. ఈ స్కూళ్లలో సుమారు 1.43 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్య ద్వారా భవిష్యత్ బాగుంటుందనే ఆశతో స్కూల్, హాస్టల్ ఫీజుల భారీగా ఉన్నా రూ.లక్షల్లో అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని కార్పొరేట్‌తో పాటు చిన్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు కూడా ఫీజులను పెంచేస్తున్నాయి. గతేడాది 1వ తరగతి విద్యార్థికి ఫీజు సరాసరి రూ.25 వేలు ఉండగా ఈ ఏడాది రూ.30 వేలు వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. తరగతుల వారీగా రూ.3 వేలు నుంచి రూ.6 వేల వరకు ఫీజులు పెంచడమే కాక ఫస్ట్ టెర్మ్ ఫీజు చెల్లిస్తేనే క్లాసులకు అనుమతిస్తామంటూ స్కూలు యాజమాన్యాలు షరతులు విధిస్తున్నాయి.

రవాణా చార్జీలూ పెంపు

విద్యా సంస్థలు సమకూర్చిన వాహనాల్లో విద్యార్థుల రవాణాకు సంబంధించి చార్జీలు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, డ్రైవర్లు, వర్కర్ల జీతాలు పెంచాలని చెబుతూ ప్రైవేటు విద్యాసంస్థలు రవాణా చార్జీలు పెంచడంతో విద్యార్థులను స్కూల్స్‌కు తీసుకువెళ్లే ఆటోలు, నాలుగు చక్రాల వాహనాల చార్జీలు సైతం పెంచేశారు. ఐదు కిలోమీటర్ల దూరానికి నెలకు రూ.1,500 వరకు వసూలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.



భీమవరంలోని ఓ ప్రైవేటు స్కూలులో దిగుమతి చేసుకున్న యూనిఫామ్ క్లాత్ కవర్లను పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)

నిబంధనలు బేఖాతర్

ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫామ్ వంటి విద్యాసామగ్రి విక్రయించకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని బేఖాతర్ చేస్తూ విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారు. మార్కెట్ ధర కంటే అధిక ధరకు విక్రయాలు చేస్తూ తమ స్కూల్లో చదివే విద్యార్థులు తమ వద్దనే కొనుగోలు చేయాలని ఖరాకండిగా చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత ఏడాది భీమవరం పట్టణంలోని రెండు విద్యా సంస్థల్లో ఈ అక్రమ విక్రయాలను విద్యార్థి సంఘ నాయకులు అడ్డుకుని విద్యాశాఖకు ఫిర్యాదు కూడా చేశారు.

విద్యాసామగ్రి విక్రయిస్తే అడ్డుకుంటాం



ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాసామగ్రి విక్రయాలను అధికారులు అడ్డుకోవాలి. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తూ తమ వద్దే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నారు. గత ఏడాది భీమవరం అక్రమంగా విద్యాసామగ్రి విక్రయిస్తున్న స్కూళ్లపై అధికారులకు ఫిర్యాదు చేశాం. విద్యాసామగ్రి విక్రయాలు చేస్తే అడ్డుకుని ఆందోళన చేస్తాం.

– టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నిబంధనలు మీరితే చర్యలు తప్పవు



నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు, కార్పోరేట్ స్కూళ్లలో విద్యాసామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తప్పవు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో బుక్స్, యూనిఫామ్ వంటివి విక్రయించకూడదు. ఈ మేరకు అన్ని మండలాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలిచ్చా. ఎక్కడైనా ప్రైవేట్ స్కూళ్లలో విద్యాసామగ్రి విక్రయించినట్లు తల్లిదండ్రులు మా దృష్టికి తీసుకువస్తే తక్షణం చర్యలు తీసుకుంటాం.

– జి.నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారిణి, భీమవరం

కౌన్సిలర్ నుంచి కేబినేట్‌లోకి



- తొలి విజయంతోనే శ్రీనివాసవర్మకు అమాత్య యోగం
- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రిగా పదవి

సాక్షి, భీమవరం: ఆయన పేరు భూపతిరాజు శ్రీనివాసవర్మ అయినా.. ప్రజలకు తెలిసింది బీజేపీ వర్మగానే. ఎంపీ అభ్యర్థిగా తన పేరును పార్టీ ప్రకటించినా.. సీటు మార్పు కోసం మిత్రపక్ష నేతల పైరవీలతో బీ ఫాం ఆయన చేతికందే వరకు ఉత్కంఠభరితంగానే సాగింది. అవాంతరాలు అధిగమించి నరసాపురం ఎంపీగా గెలుపొందడమే కాదు.. తొలి విజయంతోనే కేంద్రంలో అమాత్య పదవిని అందుకున్నారు నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ. ఎగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాసవర్మ స్వాతంత్ర్య సమరయోధుడు భూపతిరాజు బాపిరాజు మనువడు. 1991లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. తర్వాత 1995లో బీజేపీ భీమవరం పట్టణ అధ్యక్షుడిగా, 1997లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా, 1999లో నరసాపురం పార్లమెంట్ కన్వీనర్‌గా, 2001లో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా, 2010 నుంచి పదేళ్ల పాటు జిల్లా అధ్యక్షుడిగా, 2020 నుంచి రాష్ట్ర కార్యదర్శిగా పదవులు నిర్వర్తించారు. అధికారంతో నిమిత్తం లేకుండా అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకైనపాత్ర పోషిస్తూ వచ్చారు. గతంలో నరసాపురం నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీచేసిన యూవీ కృష్ణంరాజు, గోకరాజు గంగరాజుల విజయంలో కీలకంగా వ్యవహరించారు. 2014 మున్సిపల్ ఎన్నికల ద్వారా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టిన ఆయన భీమవరం నాలుగో వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. మున్సిపాలిటీ ప్యానెల్ చైర్మన్‌గా సేవలందించారు. పార్టీలతో నిమిత్తం లేకుండా అందరితోను కలుపుగోలుతనంగా ఉంటారని పేరొందారు. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం తన సొంత స్థలాన్ని ఇచ్చారు.

సీటు సాధించుకున్నారు

నరసాపురం ఎంపీ సీటు విషయమై మొదట్లో పెద్ద హైడ్రామానే నడిచింది. ఎంపీ అభ్యర్థిగా తాను పోటీలో ఉండాలని సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు భావించారు. బీజేపీ తమ అభ్యర్థిగా శ్రీనివాస వర్మ పేరును ప్రకటించింది. సీటు మార్పు కోసం రఘురామకృష్ణంరాజు ప్రయత్నాలు చేసినట్టు పెద్ద ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో శ్రీనివాసవర్మే తమ అభ్యర్థి అని.. సీటు మార్పు ప్రచారాన్ని బీజేపీ నాయకులు మీడియా ద్వారా ఖండించాల్సి వచ్చింది. పైస్థాయిలో ఉన్న పలుకుబడితో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాలకు శ్రీనివాసవర్మ తెరదించారు. పార్టీ నుంచి బీఫాం అందుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో 2.76 లక్షల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఎంపీగా తొలి విజయంతోనే శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రి పదవి వరించింది. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రిగా శ్రీనివాసవర్మకు కేబినేట్‌లో చోటు దక్కడం విశేషం.

ఈఏపీసెట్‌లో సత్తా చాటిన ఏలూరు విద్యార్థులు

- జిల్లా టాపర్లుగా పేటేటి శ్యామ్, యర్రా సిరిప్రియ
- ఇంజినీరింగ్, ఫార్మసీలో 3,257, అగ్రికల్చరల్‌లో 1599 మంది అర్హత



ఇంజినీరింగ్‌లో జిల్లా టాపర్ పేటేటి శ్యామ్



అగ్రికల్చర్‌లో జిల్లా టాపర్ సిరిప్రియ

ఏలూరు (ఆర్ఆర్ పేట): రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఇటీవల నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇంజనీరింగ్ విభాగంలో 89.03 స్కోర్‌తో రాష్ట్ర స్థాయిలో 49వ ర్యాంక్ సాధించిన కలిదిండి మండలం కళ్లపాలెంకు చెందిన పేటేటి శ్యామ్ జిల్లా టాపర్‌గా నిలిచాడు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో ఏలూరు నగరానికి చెందిన యర్రా సిరి ప్రియ 86.14 స్కోర్‌తో రాష్ట్రంలో 52వ ర్యాంక్ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. కాగా ఏలూరు జిల్లా నుంచి 4204 మంది ఇంజనీరింగ్, ఫార్మసీ పరీక్ష రాయగా 3257 మంది అర్హత సాధించారు. వీరిలో 1601 మంది బాలురు, 1656 మంది బాలికలు ఉన్నారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో జిల్లా నుంచి మొత్తం 1794 మంది పరీక్షలు రాయగా 1599 మంది అర్హత సాధించారు. వీరిలో 386 మంది బాలురు, 1213 మంది బాలికలు ఉన్నారు. కాగా ఈ పరీక్షల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో జంగారెడ్డిగూడెంకు చెందిన వాసా అభిరూప్ 86వ ర్యాంకు, పెదవేగి మండలం పెదకడిమికి చెందిన చల్లగొళ్ళ తేజేష్ గాంధీ 110వ ర్యాంకు, ఏలూరుకు చెందిన ఉయ్యూరు సుధీర్ 152వ ర్యాంకు, జంగారెడ్డిగూడెంకు చెందిన ముక్కు వెంకట సత్యపవన్ కుమార్ 178వ ర్యాంకు, నూజివీడుకు చెందిన పులి గడ్డ సుహాస్ 260వ ర్యాంకు, కళ్ళపాలెంకు చెందిన దేవబత్తుల సాయి సత్య 272వ ర్యాంకు, చానమిల్లికి చెందిన గరిగిపాటి హరి కార్తీక్ 429వ ర్యాంకు, ఆలపాడుకు చెందిన కోనిశెట్టి జైనవీన్ సంతోష్ బాబు 456వ ర్యాంకు, భువనపల్లికి చెందిన తోపు నాగ సూర్యచంద్రరావు 471వ ర్యాంకు సాధించి జిల్లాలో టాప్ 10 ర్యాకర్లుగా నిలిచారు.

అగ్రికల్చర్ విభాగంలో టాప్ 10 వీరే..

అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఏలూరుకు చెందిన కర్రి హర్షసాయి ప్రణవ్ 172వ ర్యాంకు, చాటపర్రుకు చెందిన గుంటూరు సుదీప్ చౌదరి 230వ ర్యాంకు, కొత్తూరుకు చెందిన జొన్నాడ సత్య భార్గవి 239వ ర్యాంకు, ఆగడాల లంకకు చెందిన మెట్ల భాగ్య మనీషా 274వ ర్యాంకు, చింతలపూడికి చెందిన చీకటి తన్విశ్రీ 277వ ర్యాంకు, ఉమ్మడి డైసీ వందన 302వ ర్యాంకు, ద్వారకా తిరుమలకు చెందిన పోలిబోయిన కల్యాణ్ కుమార్ 333వ ర్యాంకు, ఏలూరు, శనివారపుపేటకు చెందిన యేగిరెడ్డి రేవంత్‌సాయి 368వ ర్యాంకు, హనుమాన్ జంక్షన్‌కు చెందిన జ్యోత్స్న వైనేని 486వ ర్యాంకు సాధించి జిల్లా టాప్ టెన్‌లో నిలిచారు.

ఎన్‌సీసీ శిక్షణతో ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్
- పెదవేగిలోని జవహర్ నవోదయలో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



పెదవేగి నవోదయ ప్రాంగణంలో ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

పెదవేగి: సంకల్పబలం, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఏమైనా సాధించవచ్చని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఈ సందర్భంగా తన శిక్షణా సమయంలో హవల్దార్ సత్యరాజ్ అందించిన స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేనన్నారు. ఎన్‌సీసీ శిక్షణలో ముఖ్యమైనది టీమ్ స్పిరిట్ అన్నారు. అదే విధంగా ఒకరికొకరు సహాయపడే అలవాటును కూడా పెంచుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ విద్యార్థులుగా రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొనే అవకాశం వస్తే వదులుకోవద్దన్నారు. ఎన్‌సీసీ శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కలిస్తుందని, సి సర్టిఫికెట్ పొందడం ద్వారా ఉద్యోగావకాశాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయుధాలతో శిక్షణలో మెలకువలు అలవర్చుకోవాలన్నారు. శిక్షణా సమయంలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకునేందుకు జీవన నైపుణ్యం, జాతీయ సమైక్యత, జాతి నిర్మాణం అనే అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.ముఖర్జి స్వాగతోపాన్యాసం చేశారు. గోదావరి వరదల సమయంలో బాధితులను ఆదుకోవడంలో, ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కృషి అభినందనీయమన్నారు. జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్, పెదవేగి తహసీల్దార్ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాఠశాలల పునఃప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు డీఈఓ ఎస్.అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభానికి సంబంధించి జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.

ధాన్యం సొమ్ములు చేతికందేదెప్పుడో!

- రబీ సీజన్‌లో 2.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- ఏలూరు జిల్లాలో 17,434 మంది రైతుల నుంచి సేకరణ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.197 కోట్ల మేర చెల్లింపు
- గత 10 రోజుల్లో రైతులకు మరో రూ.100 కోట్లు జమ
- ధాన్యం బకాయి సొమ్ములు కోసం రైతుల ఎదురుచూపులు



ఏలూరు (మెట్రో): ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసింది. మిల్లర్ల నుంచి సమస్యల లేకుండా, దళారుల ప్రమేయం లేకుండా కళ్లాల వద్దకే అధికారులు వెళ్లి ధాన్యం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2023–24 రబీ సీజన్‌లో 79,689 ఎకరాల విస్తీర్ణంలో రైతులు రబీ సాగు చేయగా, 3,26,710 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. అయితే 2.40 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే విక్రయించేందుకు రైతులు ముందుకు రావడంతో గత నెల 31వ తేదీ వరకు కొనుగోలు ప్రక్రియను కొనసాగించారు. అనంతరం రైతులకు ధాన్యం సొమ్ములను చెల్లించేలా చర్యలు తీసుకున్నారు.

రూ.439.62 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 120 రైతు భరోసా కేంద్రాలు, 69 ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు ప్రక్రియను అధికారులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 17,434 మంది రైతుల నుంచి రూ.439.62 కోట్ల విలువైన ధాన్యాన్ని మే 31వ తేదీ నాటికి కొనుగోలు చేశారు. అయితే వీరిలో 14,480 రైతులకు రూ.197.10 కోట్ల మేర చెల్లించగా, అనంతరం ఇటీవల పది రోజుల్లో మరో రూ.100 కోట్లు పైబడి చెల్లింపులు పూర్తి చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గతంలో ధాన్యం విక్రయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చేది. దళారులు, మిల్లర్లు రంగప్రవేశం చేసి మద్దతు ధర లభించకుండా రైతులు నష్టపోయే విధంగా ధాన్యం కొనుగోలు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఇబ్బందులకు స్వస్తి పలికి నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసింది. రైతులు ఎక్కడా ఇబ్బందులు ఎదుర్కొనకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో భవిష్యత్తులో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఏ విధమైన ఇబ్బందులు ఎదుర్కొంటారోననే ఆందోళన వ్యక్తమవుతోంది. అదే విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ధాన్యం కొనుగోలు విధానాన్ని కొనసాగిస్తుందో లేదోనని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక గత ప్రభుత్వంలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఎప్పుడు చేతికి అందుతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పాలకొల్లు అర్బన్: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు కోరారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ప్రసవాల వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలను, అలాగే తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను వివరించాలన్నారు. కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను వివరించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడటం ద్వారా దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు అడ్డాల ప్రతాప్‌కుమార్, నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమలేశ్వరరావు, డి.కమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డి వాము దగ్ధం



మాధవరంలో దగ్ధమవుతున్న గడ్డి వాము

తాడేపల్లిగూడెం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాము దగ్ధం చేసిన ఘటన తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని గోపిశెట్టి వెంకన్నదొరకు చెందిన గడ్డిమేటు దగ్ధమైంది. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీనిపై మంగళవారం రాత్రి రూరల్ పోలీసులకు బాధితుడు గోపిశెట్టి వెంకన్న దొర ఫిర్యాదు చేశారు. పాడి పశువుల నిమిత్తం రూ.5.12 లక్షలు అప్పు చేసి మరీ గడ్డి మేటు వేశానని ఆయన చెప్పారు. వాతావరణం బాగోకపోవడంతో మరో రూ.40 వేలు విలువైన బరకాలను గడ్డివాముపై కప్పినట్టు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పింటించినట్టు చెప్పారు. నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని రూరల్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

వ్యక్తికి గాయాలు

ముదినేపల్లి రూరల్ : ముదినేపల్లి బస్టాండు సమీపంలో మంగళవారం ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి ఢీకొని వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ముదినేపల్లికి చెందిన ఎలక్ట్రీషియన్ షేక్ బాజీ తన ద్విచక్ర వాహనంపై గుడివాడ వైపు వెళుతుండగా అదే సమయంలో గుడివాడ నుంచి బంటుమిల్లి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాజీ కాలికి తీవ్ర గాయాలు కాగా, అంబులెన్సులో గుడివాడ ఏరియా ఆసుపత్రికి స్థానికులు తరలించారు.

మాతృశాఖకు శామ్యూల్

తాడేపల్లిగూడెం: పశుసంవర్థకశాఖ నుంచి డిప్యుటేషన్‌పై తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్‌గా వచ్చిన డాక్టర్ అనపర్తి శామ్యూల్ ఏడాది కాలం పూర్తి కావడంతో మాతృసంస్థకు రిపోర్టు చేయాల్సిందిగా మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. కమిషనర్ పదవి నుంచి రిలీవ్ చేశారు. కొత్త మునిసిపల్ కమిషనర్ వచ్చే వరకు గూడెంలో పనిచేస్తున్న మునిసిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

దుండగులను పట్టించిన మహిళ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో చోరీ చేస్తున్న ఇద్దర్ని ఓ మహిళ పట్టించింది. స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 10వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు యువకులు హుండీని గునపం, ఐరన్ రాడ్డులతో పగలగొడుతుండగా ఆలయం ఎదురుగా హోటల్ నిర్వహిస్తున్న భావిశెట్టి కృష్ణకుమారి గమనించింది. దుండగులు ఆలయంలో వెనుక వైపునకు వెళ్లే వరకు చూసి, ఒక్కసారిగా వెళ్లి ప్రధాన ద్వారం తలుపులను మూసివేసి ఇరుగుపొరుగును వారిని పోగు చేసింది. వారి సమాచారంతో పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని దొంగతనానికి పాల్పడిన ఆ ఇద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. దుండగులు ముందుగా పొంగుటూరులోని ఓ ఆలయంలో దొంగతనానికి పాల్పడగా విఫలమవ్వగా, తరువాత మెయిన్ రోడ్డు పక్కన ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దోపిడీకి పాల్పడినట్టు ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపారు. దుండగులను పట్టించిన మహిళకు కమిటీ సభ్యులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ శాఖ అభినందించింది.

బాల్యానికి ఏదీ భరోసా!

- నేడు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం
- అవగాహన కలిగిస్తున్న స్వచ్ఛంద సంస్థలు





చెత్త సేకరిస్తున్న బాలబాలికలు



కైకలూరులో అవగాహన కల్పిస్తున్న సాధన సభ్యులు (ఫైల్)

కైకలూరు: బడిలో ఉండాల్సిన పిల్లలను, ఆటపాటలతో గడపాల్సిన బాల్యాన్ని బందీ చేయడం అనాగరిక చర్య. తల్లిదండ్రులు మరణించడం, కుటుంబ పేదరికం, నిరక్షరాస్యత వంటి కారణాల వల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధమైనప్పటికీ ఆర్థిక కారణాల వల్ల బాలలు పనుల్లో చేరుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏలూరు, భీమవరం పట్టణాలే కాకుండా నియోజకవర్గ ప్రధాన కేంద్రాలైన నూజివీడు, పాలకొల్లు, కైకలూరు, తాడేపల్లిగూడెం, నరసాపురం వంటి పట్టణాల రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటల్స్, మోటారు మెకానిక్ షెడ్లు, పలు అపార్ట్‌మెంట్లలో పనులలో బాలలు కనిపిస్తున్నారు. పూర్వంతో పోల్చుకుంటే బాలకార్మికుల సంఖ్య తగ్గినా పూర్తిగా మార్పు రావడం లేదు. ఉదాహరణకు కైకలూరులో పారిశుద్ధ్య కార్మికుల కాలనీలోని బాలబాలికలు పారిశుద్ధ్య పనులకు వెళుతున్నారు. చెత్త సేకరిస్తున్నారు. బాలికలు వివాహాలు చేసుకుని బిడ్డలకు తల్లులవుతున్నారు. ప్రతి నెలా ఐదుగురు బాలకార్మికులను గుర్తిస్తున్నామని విజయవాడకు చెందిన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిణి ఆశారాణి తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో కలిసి అవగాహన ర్యాలీలు చేపడతామని చెప్పారు.

నేడు అవగాహన కార్యక్రమాలు

బాల కార్మికుల దుస్థితిని ఎత్తిచూపడానికి, బాలకార్మిక వ్యవస్థను అరికట్టేందుకు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో జూన్ 12 నుంచి ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవంగా ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ఈ ఏడాది మన కట్టుబాట్లపై పని చేద్దాం – బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు ర్యాలీలు, అవగాహన సభలను బుధవారం నిర్వహించనున్నారు.

రక్షణ చట్టాలివీ..

బాలి కార్మికుల రక్షణకు అనేక చట్టాలను రూపొందించారు. బాలకార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కరించేందుకు గురుపాదస్వామి కమిటీని 1979లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1986 బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం రూపొందించారు. 2009 విద్యా హక్కు చట్టం ద్వారా బాలబాలికలకు నిర్బంధ విద్య అందిస్తున్నారు. 2016 బాల కార్మికుల సవరణ చట్టం 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టడాన్ని నిషేధించింది. 2017లో బాల కార్మికుల నిషేధ చట్టం సవరణలు చేశారు. ఇవే కాకుండా గనుల చట్టం – 1952, ఫ్యాక్టరీల చట్టం – 1948, మర్చంట్ షిప్పింగ్ యాక్టు – 1958, మోటారు ట్రాన్స్‌పోర్టు చట్టం – 1961, బీడీ, సిగర్ వర్కర్స్ చట్టం – 1966, బాండెడ్ లేబర్ సిస్టమ్ యాక్ట్ – 1976, పేలుడు చట్టం – 1984ల ద్వారా బాలలను పనిలో పెట్టకూడదు.

శిక్షలు ఇలా..

14 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యజమానికి 6 నెలలు నుంచి 24 నెలల జైలు శిక్ష లేదా రూ.20 వేలు నుంచి రూ.50 వేలు జరిమానా విధిస్తారు. శిక్ష అనుభవించిన తర్వాత తిరిగి అదే తప్పు చేస్తే మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. దాదాపు 20 వృత్తుల్లో బాలబాలికలు పనిచేయకూడదని నిబంధనలు ఉన్నాయి. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాల ద్వారా బాలకార్మికులను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అసంఘటిత రంగ తయారీ యూనిట్లు, చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంటుతో కలిసి దాడులు చేసి బాలకార్మికులకు విముక్తి కలిగిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంటు, సర్వశిక్షాభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నాం. పనుల నిమిత్తం వలసలు వెళ్లిన కుటుంబ పిల్లలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో భోజన వసతి కల్పిస్తున్నాం. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పిల్లలను పనులకు కాదు బడులకు పంపించాలి.

– పాముల ఏసుపాదం, సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, కైకలూరు

బాలలతో పని చేయించడం నేరం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం 14 సంవత్సరాలు దాటిన బాలబాలికలతో పనులు చేయించడం నేరం. చైల్డ్ లేబర్ డిపార్టుమెంటు, పోలీసు సంయుక్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. దాడుల్లో పట్టుబడిన బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. నేడు బాలబాలికలకు ఉచిత విద్యా అవకాశాలు ఉన్నాయి. ఎవరైనా బాలలను పనుల్లో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం.

– ఆకుల రఘు, పట్టణ సీఐ, కైకలూరు

అల్లర్లపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు లేఖను చూపుతున్న ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కూటమి అధికారంలోకి రావడంతో వైఎస్సార్ సీపీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కి ఫిర్యాదు చేసినట్టు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన యాళ్లవానిగరువులో తన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ఇళ్లలోకి వెళ్లి విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా, ఆస్తులు కూడా ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. విధ్వంసకారుల దమనకాండను పోలీసులు దగ్గరుండి చూస్తూ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో జరిగిన అనేక ఘటనలపై తాను స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. విధ్వంసకారులు యూనివర్సిటీల్లోకి ప్రవేశించి విగ్రహాలను ధ్వంసం చేసి, వైస్‌చాన్సలర్లపైనా, విద్యార్థులపైనా దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక విధంగా రాజ్యాంగ వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతున్నాయని వాపోయారు. బాధితుల ఇళ్లకెళ్లి పరామర్శించాలంటే పోలీసులు సహకరించడం లేదని ఆరోపించారు. జాతీయ కమిషన్ చైర్మన్ హోదాలో రాష్ట్రంలో పర్యటించి టీడీపీ, జనసేన అల్లరి మూకల దాడుల్లో గాయపడ్డ బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పాలని కోరారు. అలాగే అల్లరి మూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు జరిగిన నష్టాలను అంచనా వేసి బాధితులకు న్యాయం చేయాలని ఆనందప్రకాష్ జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కి సూచించారు.

ముసుగులు తొలగేదెప్పుడో?

- 6న ముగిసిన ఎన్నికల కోడ్
- స్పందించని అధికారులు



భీమవరంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఉన్న ముసుగు



పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామ సచివాలయం వద్ద వైఎస్ విగ్రహానికి ఉన్న ముసుగు



వీరవాసరంలో సీపీఎం స్థూపానికి తొలగని ముసుగు



చింతలకోటి గరువు వద్ద గ్రామం పేరును తెలిపే బోర్డుపై ఉన్న ముసుగు

భీమవరం: ఎన్నికల కోడ్ ముగిసి వారం రోజులు గడిచిపోతున్నా రాజకీయ నాయకుల విగ్రహాలు, అభివృద్ధి పనుల శిలాఫలాలపై వేసిన ముసుగులు తొలగలేదు. సార్వత్రి ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నెలలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికల నిబంధనలంటూ ఆగమేఘాలపై పట్టణాలు, గ్రామాల్లోని రాజకీయనాయకులైన వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు, గ్రామ పంచాయతీల వద్ద ఏర్పాటుచేసిన సూచిన బోర్డులకు సైతం మునిసిపల్, పంచాయతీ అధికారులు ముసుగులు వేయించారు. కొన్నిచోట్ల ప్రభుత్వ సిబ్బంది అత్యుత్సాహంతో అంబేడ్కర్, సర్ ఆర్థర్ కాటన్ వంటి మహనీయుల విగ్రహాలకు సైతం ముసుగులు వేశారు. శిలాఫలకాలపై నాయకులు, పేర్లు, ఫొటోలు కన్పించకుండా పేపర్లతో కప్పి పూర్తిగా మూసివేశారు. మే 13వ తేదీన పోలింగ్ ముగియగా, జూన్ 4వ తేదిన ఓట్ల లెక్కింపు పూర్తిచేశారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

రాష్ట్రంలో ఎన్నికలు ముగియంతో ఈనెల 6వ తేదీన ఎన్నికల కోడ్ ముగిసినట్టు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. కోడ్ ముగిసి వారం రోజులు గడిచిపోతున్నా మునిసిపల్, పంచాయతీ అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలు, స్థూపాలు, శిలాఫలకాలకు వేసిన ముసుగులు తొలగించడం లేదు. కొన్నిచోట్ల పార్టీల స్థూపాలు, రాజకీయ నాయకులు విగ్రహాలకు కప్పిన బరకాలు చెదిరిపోయి అస్పష్టంగా కన్పిస్తున్నాయి. మరికొన్నిచోట్ల అభివృద్ధి పనుల శిలాఫలకాలకు అంటించిన కాగితాలు కొంతమేరకు చిరిగిపోయాయి ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విగ్రహాలపై ముసుగులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి శ్రీనివాసవర్మ తండ్రి కాలికి గాయం



తండ్రి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న శ్రీనివాసవర్మ

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు తన నివాసంలోని బాత్‌రూమ్‌లో పడిపోవడంతో కాలితుంటికి గాయమైంది. దీంతో ఆయన్ని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో సోమవారం చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే శ్రీనివాసవర్మ ఢిల్లీ నుంచి భీమవరం చేరుకుని ఆసుపత్రిలో తన తండ్రిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

వర్మను కలిసిన నాయకులు

కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొట్టమొదటిసారిగా భీమవరం చేరుకున్న శ్రీనివాసవర్మను మంగళవారం పలువురు శ్రీనివాసవర్మను ఆసుపత్రి, ఇంటి వద్ద కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. వర్మను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, బీజేపీ క్రమశిక్షణా కమిటీ రాష్ట్ర చైర్మన్ పాక వెంకటసత్యనారాయణ, డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, గోకరాజు రామరాజు, ఒబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ట్యాక్సీ యజమానులకు ఝలక్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగకముందే కాకినాడకు చెందిన ట్యాక్సీ యజమానులకు చేదుఅనుభవం ఎదురైంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. కాకినాడకు చెందిన పలు ట్యాక్సీల యజమానులను అక్కడి రవాణా శాఖ అధికారులు చంద్రబాబు ప్రమాణ స్వీకారం నిమిత్తం పురమాయించారు. ట్యాక్సీలు ఎక్కడి నుంచి ఎక్కడికి పంపాలనేది ఏలూరు అధికారులు చెబుతారని, ఒక్కో ట్యాక్సీకి రూ.11 వేలు చెల్లిస్తారని తెలిపారు. దీంతో వారంతా మంగళవారం మధ్యాహ్నానికే ఏలూరు రవాణా శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే వారిలో కొందరికి మాత్రమే కిరాయి ఇచ్చి సుమారు 20 వాహనాలకు కిరాయి లేదని, తిరిగి వెళ్లిపోవచ్చని చెప్పారు. దీంతో ట్యాక్సీ యజమానులు నిరాశకు గురయ్యారు. ఆయిల్ ఖర్చులు, టోల్‌గేట్ చార్జీలు, తదితర ఖర్చులైనా ఇవ్వాలని కోరగా అందుకు అధికారులు నిరాకరించడంతో ట్యాక్సీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిలో కొందరు మీడియాకు సమాచారం ఇచ్చి అధికారుల నిర్వాకాన్ని వివరించారు. దీంతో రవాణా అధికారులు మీడియా ప్రతినిధులు రవాణా కార్యాలయం వద్దకు వెళ్లేలోపే వారితో సెటిల్‌మెంట్ చేసేసుకున్నారు. అధికారులతో తమకు సెటిల్‌మెంట్ అయిపోయిందని, ఈ అంశాన్ని మీడియాలో చూపవద్దని ట్యాక్సీ యజమానులు సర్దిచెప్పారు.

ఓపెన్ ఇంటర్ ప్రయోగ పరీక్షలకు 65 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన విద్యార్థులకు సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. భౌతికశాస్త్రం ప్రయోగ పరీక్షకు 40 మంది విద్యార్థులకు 23 మంది హాజరు కాగా, 17 మంది గైర్హాజరయ్యారు. అలాగే రసాయన శాస్త్రం పరీక్షకు 30 మందికి గాను 23 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. జీవశాస్త్రం పరీక్షకు 27 మందికి గాను 19 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాం చెప్పారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

టి.నరసాపురం: మండలంలోని టి.నరసాపురం పంచాయతీ రుద్రకోట రాజుగూడెం, కాపుగూడాలలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికే కొందరు విషజ్వరాల బారిన పడి ఆసుపత్రిలో చికిత్సపొందారు. వాతావరణ మార్పుల దృష్ట్యా జ్వరాలు ప్రబలుతున్నందున వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని మొర పెట్టుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో మృతిచెందిన కొండేటి ఆదిశేషు



ప్రమాదంలో మృతిచెందిన మైనం అశోక్



ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

అన్నప్రాసనకు వెళ్లి వస్తుండగా బైక్‌ను ఢీకొన్న కారు

నూజివీడు: అన్నప్రాసన వేడుకకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా నూజివీడు మండలం మీర్జాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు మండలం జంగంగూడెంలోని బంధువుల ఇంట్లో అన్నప్రాసన కార్యక్రమానికి కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురానికి చెందిన స్నేహితులు కొండేటి ఆదిశేషు (63), మైనం అశోక్ (34) ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఫంక్షన్ అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మీర్జాపురం వద్ద సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎదురుగా వస్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆదిశేషు, అశోక్‌లు కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఆదిశేషుకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లయ్యాయి. అశోక్‌కు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఆర్ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఆర్టీసీ బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో బుధవారం జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి నాలుగు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారులకు ఆర్టీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఏలూరు జిల్లా పోలవరం, చింతలపూడి, ఉంగుటూరు, నూజివీడు, కైకలూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలకు అధికారులు ఆయా బస్సులు కేటాయించే పనిలో పడ్డారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి జిల్లా నుంచి మొత్తం 28 బస్సులు వెళ్లనుండడంతో ప్రయాణికులకు రవాణా సౌకర్యం ఇబ్బందికరంగా మారే అవకాశం ఏర్పడింది. కేటాయించిన బస్సులకు చెల్లింపులు ఎవరు చేస్తారనే అంశంపై ఆర్టీసీ అధికారులకు స్పష్టత లభించలేదు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పోలవరం సందర్శనకు ప్రతినిత్యం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయగా, దానికి సంబంధించిన చెల్లింపులు తరువాత వచ్చిన ప్రభుత్వం చేయాల్సి వచ్చిందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఈ సారి కూడా చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించినట్టు అధికారులు తెలిపారు. బుధవారం ఏలూరు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్, నూజివీడు, నున్న బైపాస్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, రామవరప్పాడు రింగ్, గుణదల, చుట్టుగుంట, హోటల్ స్వర్ణప్యాలెస్, ఏలూరు రోడ్డు, ఓల్డ్ పీసీఆర్ జంక్షన్ మీదుగా బస్టాండువైపు వెళ్లాలన్నారు. ఏలూరు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి నూజివీడు, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. చెన్నై వైపు వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి గుడివాడ, పామర్రు, పులిగడ్డ, పెనుమూడి వారధి, రేపల్లె, బాపట్ల, ఒంగోలు మీదుగా వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు.

టమోటా @ రూ.80

రైతుబజారులో కిలో రూ.65



నూజివీడు: పచ్చిమిర్చి కిలో ధర సెంచరీకి చేరి కొనుగోలుదారులకు ఘాటుచూపిస్తుండగా, నేడు టమోటా వంతు వచ్చింది. వేసవి కారణంగా టమోటా సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోవడంతో టమోటా ధర పైపైకి ఎగబాకుతోంది. రైతుబజారులోనే కిలో రూ.65కు చేరడంతో ప్రజలు కొనాల్సిన చోట పావుకిలో కొని సరిపెట్టుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.80 పలుకుతోంది. గ్రామాల్లో రూ.80 నుంచి రూ.90 విక్రయిస్తున్నారు. దీంతో పెట్టుబడి ఎక్కువ అవడం, ప్రజల కొనుగోలు తగ్గిపోవడంతో రైతుబజారులోని దుకాణదారులు కూడా సగానికి సగం అమ్మకాలను తగ్గించేశారు. వేసవికి ముందు సాగుచేసిన పంటకాలం పూర్తికావడంతో స్థానికంగా టమోటకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రాంతం నుంచి వస్తున్న టమోటాను హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచి కొనుగోలు చేసి అమ్మాల్సి వస్తుండటంతో టమోటా ధర బాగా పెరిగింది. టమోటా ధర మామూలుగా ఉన్నప్పుడు నూజివీడు రైతుబజారులో రోజుకు రెండు టన్నుల వరకు అమ్ముడుపోయేవి. ధర పెరగడంతో కేవలం టన్ను కూడా అమ్ముడు కావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం



తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో నిర్వహించిన శిబిరంలో హాజరైన 26 మందికి డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్ర బాబు వైద్యసేవలు అందజేశారు. సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి వైద్యసలహాలు అందజేశారు. పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాలసత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, సీఎస్ సాధు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరుని పుట్టవద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న హైమావతి తదితరులు

పెంటపాడు: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, గూడెం ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్‌లు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్న దృష్ట్యా మంగళవారం ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళా నాయకురాలు, హిందూ ధర్మప్రచారపరిషత్ సభ్యురాలు కొండ్రెడ్డి హైమావతి ఆధ్వర్యంలో ఉమామహేశ్వరం పురాతన సుబ్రహ్మణ్యేశ్వరుని పుట్ట వద్ద పాలుపోసి, సుబ్రహ్మణేశ్వరుని ప్రత్యేక అభిషేకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచంట ధనలక్ష్మి, వైష్ణవి, భక్తులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



మురుగు డ్రైయిన్‌ల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మలేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ దోమల నిర్మూలనలో భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ పేర్కొన్నారు. దోమల నిర్మూలన, నివారణలో భాగంగా మురుగు నీటి నిల్వ ఉన్న గుంటలలో మంగళవారం స్థానిక 11వ వార్డు, 12వ వార్డులో పలు ప్రాంతాలలో తాడేపల్లి చెరువు, ఇతర నీటి నిల్వలు, గుంటలు తదితర ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, శానిటరీ ఇనస్పెక్టర్, సచివాలయం సెక్రటరీలు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



పెన్నాడలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.అత్రియతో కలసి పరిశీలించారు. బి.బలరాం ఉపాధి కూలీలకు ఎదురవుతున్న సమస్యలపై ఉపాధి పనులు ఏవిధంగా జరుగుతున్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బలరాం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం 100 రోజులు పని కల్పించాలి కానీ అన్ని రోజులు పనులు కల్పించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళలకైతే మూడు లేక నాలుగు వారాలు మాత్రమే పనులు కల్పిస్తున్నారని అన్నారు. భారీ యంత్రాలు వచ్చేయడంతో వ్యవసాయ కూలీలకు పని దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సులు, పని ప్రదేశాల్లో ఎండ తీవ్రత బారిన పడకుండా ఉపాధి కూలీలకు టెంట్లు చల్లని త్రాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. కానీ ఇవేమి అమలు కావడంలేదని కూలీలు వాపోయారు. ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలన్నారు.

బాబోయ్ ఇదేం ఉక్కబోత

- రుతుపవనాలు ప్రవేశించినా జాడలేని వాన
- భిన్న వాతావరణ పరిస్థితులతో బెంబేలు



తణుకులో సూర్యుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా రోడ్లు

తణుకు: వారం రోజుల క్రితమే రుతుపవనాలు ప్రవేశించాయి... వర్షాలు కురుస్తాయని అంతా ఆశగా ఎదురుచూశారు... అయితే వర్షాలు లేవు సరికదా తీవ్రమైన ఉక్కబోత కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజుల క్రితం అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల పాటు తణుకు ప్రాంతంలో భారీ వర్షాలు కురిశాయి. అయితే ప్రస్తుతం చినుకు జాడ లేకపోవడంతో ఉక్కబోత ఊపిరాడనివ్వడంలేదు. ఇలా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడం... వాతావరణంలో ద్రోణి, ఆవర్తనాలే ఇందుకు కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

38 డిగ్రీలకు పైగా నమోదు

ఒకవైపు రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ జిల్లాలోని తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. ఏప్రిల్, మేలో జిల్లాలోని 45 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కబోతకు గురై వృద్ధులు, పిల్లలు అగచాట్లు పడుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. పగలంతా ఎండ ప్రచండంగా ఉండగా.. సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై చల్లదనంగా మారుతోంది. ఇదే సమయంలో నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలో రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. వీటి రాకకు ముందు సముద్రంలో అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడుతుంటాయి. ప్రస్తుతం దక్షిణాది నుంచి ఒక ద్రోణి ఆవరించి ఉండటంతో సాయంత్రం కాగానే జిల్లాలో వాతావరణ మారుతోంది. సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో వాన రాకకోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో తణుకు శశి విద్యార్థుల సత్తా



కార్తీక బ్రహ్మనందం



పెరుమాళ్ల స్వాతిశ్రీ



డీ మోహనలక్ష్మీ



మల్లిపూడి హర్షకుమార్

తణుకు టౌన్: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో తణుకు శశి విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో తామరపల్లి కార్తీక బ్రహ్మనందం స్టేట్ 258 ర్యాంక్, పెరుమాళ్ల స్వాతిశ్రీ స్టేట్ 891వ ర్యాంక్, డీ గాయిత్రీ వైష్ణవి 1082వ ర్యాంక్, ఎస్ భానుప్రకాష్ 1128వ ర్యాంక్, కే సిరివల్లి 1375 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు 1000 లోపు 2 ర్యాంక్‌లు, 2 వేలు లోపు 5 ర్యాంక్‌లు, 3 వేలు లోపు 9 మంది, 5 వేలు లోపు 21 మంది, 10 వేల లోపు 49 మంది ర్యాంక్‌లు సాధించినట్లు తెలిపారు. బైపీసీ విభాగంలో తమ విద్యార్థులు డీ మోహనలక్ష్మీ స్టేట్ 1064 ర్యాంక్, మల్లిపూడి హర్షకుమార్ 1664 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ వెలగల సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నల్లూరి రాఘవేంద్రరావు, కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఎంసెట్‌లో గూడెం విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పోతుల పార్థీవ్ ఎంసెట్‌లో 325వ ర్యాంకు సాధించాడు.. తాడేపల్లిగూడెంలో సెంట్ ఆన్స్‌లో చదువుతూ పదో తరగతిలో టౌన్ ఫస్ట్ వచ్చాడు. ఇప్పుడు రాజమండిలో తిరుమల కాలేజీలో ఇంటర్ ఎంపీసీ చదువుతున్నాడు. యాగర్లపల్లికి చెందిన ఈదుపల్లి సత్యదుర్గ సాత్విక్ ఎంసెట్‌లో 293 ర్యాంకు సాధించాడు. సత్విక్ పదో తరగతిలో ప్రథమ స్థానంలో అత్యధిక మార్కులు సాధించాడు. ఇటీవల నిర్వహించిన ఎంసెట్ పారీక్షల్లో 293 వర్యాంకు సాధించడం తమకు గర్వంగా ఉందని సాత్విక్ తండ్రి ఈదుపల్లి రాజేష్ తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అత్తిలి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ప్రమోదకుమారి

అత్తిలి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు తప్పనిసరిగా ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి ప్రమోదకుమారి అన్నారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎస్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ జన్మనిస్తున్న తల్లి, జన్మిస్తూ బిడ్డ మరణించకూడదని, అలా జరగకుండా ఉండాలంటే 3వ నెలలోపు గర్భిణీని నమోదు చేసుకుని, గృహసందర్శన ద్వారా హెల్త్ చెకప్ చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి మాట్లాడుతూ లబ్ధిదారుల గృహ సందర్శనకు వెళ్లినప్పుడు ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, రక్తహీనతపై తెలపాలన్నారు. మరో సూపర్ వైజర్ కె కుమారి మాట్లాడుతూ కిశోర బాలికల అవగాహన కార్యక్రమాలు విరివిగా జరపాలని, గల్ఫ్ దేశాలకు వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలను తరచుగా సందర్శిస్తూ ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకుని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణీలు, రక్తహీనతతో ఉన్న గర్భిణీలు, బాలింతల వివరాలను తమకు తెలపాలని కోరారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేయడం వల్ల తల్లి,బిడ్డ మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి, సీహెచ్ఓ సి మురళి, హెచ్ఈ జి ప్రమీలాదేవి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోండి



భవిత సెంటర్‌లో మాట్లాడుతున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్ సేవలను దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ విలీన ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు పేర్కొన్నారు. మంగళవారం భవిత సెంటర్‌లో మాట్లాడుతూ మండలంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ ద్వారా 43 మంది దివ్యాంగుల పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి, పాఠశాల పునః ప్రారంభమైన వెంటనే గుర్తించిన దివ్యాంగుల పిల్లలను పాఠశాలలో పేర్లు నమోదు చేయిస్తామని, అవసరమైన వారికి భవిత కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు, విద్యా సామాగ్రి అందజేత, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, బోధన సామాగ్రి, ప్రయాణ భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, గరల్స్ స్టైఫండ్, హోమ్ బేస్డ్ స్టైఫండ్ అందజేస్తామని చెప్పారు. నిర్ధారణ శిబిరాలలో గుర్తించిన వారికి ఉచిత ఉపకరణాలు అందజేత, తీవ్ర వైకల్యం ఉన్నవారికి ప్రతి శనివారం ఇంటి వద్ద సమగ్ర శిక్ష ద్వారా లైఫ్ స్కిల్స్, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అనేక సదుపాయాలను దివ్యాంగుల పిల్లలకు అందజేస్తుందని తెలిపారు .

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



తణుకులో ఏపీటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) తణుకు జోన్ సమావేశం స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో మంగళవారం జోనల్ కన్వీనర్ వి.రామమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి పాఠశాలల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని, మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలని, పీఆర్‌సీ ఇంటీరియం రిలీఫ్‌ను వెంటనే ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలన్నారు. బకాయిపడ్డ డీఏ ఎరియర్స్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో తణుకు మండల శాఖ అధ్యక్షుడు పీవీ పెద్దిరాజు, జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు ఎ.వీరభద్రరావు, ఎస్.జయరాజు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌లో శశి విద్యార్థుల హవా



డి.పూజిత తులసీ



కె.కార్తీక్ సాయి చైతన్య

తాడేపల్లిగూడెం: ఏపీఈఏపీసెట్‌లో శశి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో 689వ ర్యాంకుతో కె.కార్తీక్‌సాయి చైతన్య, నిలిచారన్నారు. కె.జాహ్నవి 1,329, టి.లక్ష్మీ సంజన 1,335, టి.అంజుష 1413, ఎం.మేధా 1452, బి.అరవింద్ 1449, ఎం.మొహిద్దీన్ 1734, ర్యాంకులు పొందారన్నారు. 2000 లోపు ర్యాంకులు ఏడుగురు, 3000 లోపు 12 మంది, పదివేల లోపు ర్యాంకులు 32 ర్యాంకులు సాధించారన్నారు. అగ్రికల్చరల్ .ఫార్మసీ విభాగంలో డి.పూజితతులసీ 2626వ ర్యాంకు, జి.విశ్వకీర్త్ 4470, పదివేలలోపు ఐదుగురికి ర్యాంకులు వచ్చాయన్నారు. ర్యాంకులు పొందిన విద్యార్థులను సంస్థ వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక డైరెక్టర్ క్రాంతిసుధలు అభినందించారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన రూట్స్ విద్యార్థులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్లు

తణుకు అర్బన్: ఇటీవల విడుదలైన ఐఐటీ జేఈఈ ఎంట్రన్స్ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో తణుకు రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ పూర్వ విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎల్‌కే త్రిపాఠి తెలిపారు. తణుకు రూట్స్ స్కూల్‌లో ఫుల్ టైమ్ ఐఐటీ ఫౌండేషన్ ప్రోగ్రామ్‌లో చదివిన పూర్వ విద్యార్థులు కేఎస్‌టీ అనూప్‌రెడ్డి 62, బీహెచ్‌బీకే ప్రవీణ్‌వర్మ 1413, ఎం.తేజ 1557, వి.లక్ష్మీఅంజన 2141, పి.రూపేష్‌వెంకట్ 2209, డి.తేజఅభిరామ్ 4031, ఎండీ ఆసిఫ్ 6723వ ర్యాంకులు సాధించినట్లు చెప్పా రు. ఈసందర్భంగా మంగళవారం తణుకులో ఏర్పాటుచేసిన అభినందనసభలో విద్యార్థులను, ఉపాధ్యాయులను సంస్థ డైరెక్టర్లు ఎల్‌కే త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎస్.సుధాకర్ వర్మలు అభినందించారు.

ఘనంగా అన్న సమారాధన

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ కమిటీ సభ్యుడు మేకా శేషుబాబు పాల్గొని భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి శేషవస్త్రాలతో శేషుబాబుని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవనం సాగించడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలివెల మాజీ సర్పంచ్ కెల్లా సింహాచలం, దేవరపల్లి సత్తిబాబు, దేశంశెట్టి రాము పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పెంటపాడు ఎస్సీ బాలుర వసతిగృహంలో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: వసతి గృహాల్లో దోమల వ్యాప్తి నిరోధానికి చర్యలు చేపట్టినట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తణుకు సబ్ యూనిట్ పరిధిలోని వసతి గృహాల్లో దోమల నివారణకు గోడలపై మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ అడిషన్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థినీ, విద్యార్థుల సౌకర్యార్థం గోడలపై దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తున్నామని తద్వారా దోమ వాలిన వెంటనే ఎగరలేకుండా పోతుందని స్పష్టం చేశారు. తణుకు సబ్ యూనిట్ పరిధిలోని 21 వసతి గృహాల్లో ఈ దోమల మందు పిచికారీ చేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, పీహెచ్‌సీల హెల్త్ సూపర్‌వైజర్స్ ఉమామహేశ్వరరావు, మల్లేశ్వరరావు, వెంకటరాజు, హెల్త్ అసిస్టెంట్ తాతాజీ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో దోమల నిర్మూలనా కార్యక్రమాలు

పెంటపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని గూడెం సబ్‌యూనిట్ అధికారి వై.వీ లక్ష్మణరావు తెలిపారు. ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతిగృహాలలో మంగళవారం దోమల నిర్మూలనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వై.వీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆల్ఫా సైబర్‌మిత్రిన్ మందును వసతిగృహాల గదులలో కొట్టించారు. వర్షాకాలం ప్రభులుతున్న సమయంలో దోమల నిర్మూలను విద్యార్థులు ఉద్యమంలా చేపట్టాలన్నారు.బీ కార్యక్రమంలో డాక్టర్లు తోట రాజేష్, మౌనిక, ఆరోగ్య అధికారులు సత్యనారాయణ, మారిశెట్టి తేజోనాథ్, సాయిబాబా, నరేంద్ర, పూర్ణ, రాజ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులోని వసతి గృహంలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక జీవనమే ముక్తికి మార్గం

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక జీవనం సాగించడం ద్వారానే మనిషికి ముక్తిమార్గం లభిస్తుందని మార్కండేయ తపోవనం (పెనుమంట్ర) ప్రవచన కర్త మాతా ఓం శ్రీ అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు రామాలయం వద్ద మంగళవారం మాతా ఓం శ్రీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రామాయణ, మహాభారతంలోని పలు అంశాలను వివరించారు. త్వరలో రామాలయం వద్ద 9 రోజుల పాటు రామాయణం లోని పలు అంశాలను వివరించడానికి కమిటీ అనుమతి కోరినట్లు మాతా ఓం శ్రీ వివరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాతా ఓం శ్రీని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్‌వీ రత్నారావు, బి.గోపాలకృష్ణంరాజు, పి.అచ్యుతరామ్, కె.జయభారతరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఒ.దినేష్ కోరారు. మండలంలోని రామన్నపాలెం 2 సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరం ద్వారా రోగులను పరిక్షించడం ద్వారా వెంటనే రోగులకు వైద్య సేవలు అందించవచ్చున్నారు. గ్రామంలోని బాలింతలను, గర్భిణులను, కిశోర బాలికలను, లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం కె.స్వర్ణలత, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు రేవతి, మరియమ్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

దళిత సేన నాయకులు బలంగా పనిచేయాలి



చీలి మోహనరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రవిప్రకాష్

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, బలహీనవర్గాల సంక్షేమం, హక్కుల సాధన, ఆర్థికాభివృద్ధి దళిత సేన నాయకులు బలంగా పనిచేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కడియద్ద గ్రామంలో దళిత సేన జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా చీలి మోహనరావును నియమిస్తూ పత్రాన్ని అందజేశారు. తణుకు నియోజకవర్గ దళిత సేన అధ్యక్షుడిగా దూలపల్లి రాంబాబు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడిగా సత్తయ్య, తాడేపల్లిగూడెం మండల ఉండ్రాజవరపు కృష్ణ, పెంటపాడు మండల మహిళా అధ్యక్షురాలిగా ఉండ్రాజవరపు సరోజిని, కడియద్ద గ్రామ అధ్యక్షుడు గెద్దం సుందరరావు, ఉపాధ్యక్షుడిగా ఉండ్రాజవరపు వెంకటేశ్వరరావు, జగ్గన్నపేట గ్రామ అధ్యక్షుడిగా కిలాడి రవి, గౌరవాధ్యక్షుడిగా కంకిపాటి సుబ్బారావు, నీలాద్రిపురం, కృష్ణాపురం, పుల్లాయగూడెంగ రామాలకు అధ్యక్షులకు నియామకపు పత్రాన్ని రవిప్రకాష్ అందజేశారు. రాష్ట్ర దళిత సేన కార్యదర్శి బేతాళ జయసుధ, జిల్లా మహిళా అధ్యక్షురాలు దిర్సిపాముల పుష్ప, పెదతాడేపల్లి గ్రామ మహిళా అధ్యక్షురాలు రమణ, కొండ్రుప్రోలు గ్రామ అధ్యక్షురాలు కంకిపాటి దుర్గ, ఉపాధ్యక్షురాలు రమ్య, గౌరవాధ్యక్షురాలు ధనలక్ష్మి, గెద్దం రాజు, మధుమంచి విజయ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ హనుమకు వినతిపత్రం ఇస్తున్న అపుస్మా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రైవేట్ విద్యా సంస్థలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టులు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా) సభ్యులు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి హనుమను కలిసి వినతిపత్రం సమర్పించారు. అపుస్మా జోన్ అధ్యక్షుడు వాకలపూడి రామకృష్ణ మాట్లాడుతూ టాలెంట్ టెస్టులు నిర్వహించడం చట్ట విరుద్ధమని, అటువంటి వాటికి ఎటువంటి అనుమతి ఉండదని, తల్లిదండ్రులు విషయాన్ని గమనించాలని కోరారు. టెస్టులు నిర్వహిస్తే అపుస్మాకు గాని, విద్యాశాఖ అధికారులకు గాని ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి పచ్చిపాల శివశంకర్, మాజీ అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, రాయన్న, అత్తిలి శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ప్రసాద్, కె.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బి ప్రమోదకుమారి కోరారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీస్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్‌కు ప్రమోట్ అయ్యే విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన పట్టణ బీజేపీ నాయకులు విలేకరులకు తెలిపారు. మంగళవారం భీమవరంలో మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.